# స్పెషాలిటీ వైద్యుల భర్తీకి చర్యలు

### వేతనాల పెంపుపై కసరత్తు

### వైద్య దంపతులిద్దరికీ ఒకేచోట కొలువు

### యోచిస్తున్న అధికార వర్గాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషాలిటీ వైద్యులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాలకు పని చేయడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వారికి ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వ సర్వీసులోకి రావడానికి ఇష్టపడటం లేదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియామకాలు పూర్తికాగానే స్పెషాలిటీ వైద్యుల భర్తీపై దృష్టి సారించనున్నారు. తాజాగా 407 స్పెషాలిటీ వైద్యుల ఉద్యోగాల కోసం 1,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో విధుల్లో చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన వారు 128 మంది మాత్రమే. ఇందులోనూ చాలా మంది ఆసుపత్రుల్లో చేరలేదు. స్పెషాలిటీ వైద్యుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కారం చేయాలని వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పి.వి.రమేష్ నిర్ణయించారు. విధివిధానాలు రూపొందించి, త్వరలోనే భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు.

**త్వరలోనే ఉన్నతస్థాయి భేటీ:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్ ఉద్యోగాల్లో చేరడానికి వైద్యులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేక విభాగాల్లో ఎండీ, ఎంఎస్ డిగ్రీలు చేసినవారు ప్రభుత్వ సర్వీసుల్లో చేరడానికి ఆసక్తి చూపడం లేదు. వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలోని జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో జనరల్ మెడిసిన్, పెథాలజీ, ఆర్థోపెడిక్స్, అనస్థీసియా, సైకియాట్రి, పిడియాట్రిక్స్, రేడియాలజీ, జనరల్‌సర్జరీ విభాగాల్లో వైద్యుల కొరత ఎక్కువగా ఉంది. ఈ సమస్యను అధిగమిస్తే రోగులకు మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సర్వీసుల్లో చేరే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలనే ఆలోచన ఉంది. ఈ విషయంపై త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు. వైద్య దంపతులను ఒకే ఆస్పత్రిలో నియమిస్తామని హామీ ఇవ్వనున్నారు. కనీసం ఐదేళ్లు బదిలీ చేయబోమని కూడా చెప్పనున్నారు.

26-12-2010 Eenadu